ఈ వంతెనపై ప్రయాణం.. ప్రమాదకరం

కామవరపుకోట: మండలంలోని కళ్ళచెరువు సమీపంలోని గుండేరు వాగుపై వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. లింగపాలెం మండలం ఆశన్నగూడెం సమీపంలో, కామవరపుకోట మండలం కళ్ళచెరువు సమీపంలో రెండు మండలాలను కలుపుతూ సరిహద్దుగా ఉంది. ఈ వంతెనపై వెళ్లటం ప్రమాదకరమని తెలిసినా నిత్యం రైతులు, వ్యవసాయ కూలీలతో పాటు వాహనాలు, భారీ వాహనాలు రాకపోకలు కొనసాగేవి. ఈ రెండు మండలాల కాకుండా ఇతర ప్రాంతాలనుంచి కూడా మొక్కజొన్న, పామాయిల్, కోకో, నిమ్మ వంటి అనేక రకాల వ్యవసాయ ఉత్పత్తులు ఈ వంతెన మీద నుంచి వివిధ ఫ్యాక్టరీలకు, వ్యాపార సంస్థలకు నిత్యం తరలించేవారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో వరదలు వచ్చి ఈ వంతెన పూర్తిగా కుంగిపోయింది.

గుండేరు వాగుపై కుంగిన వంతెన

దీనితో వాహనదారులు, రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో యుద్ధ ప్రాతిపదికన ఈ వంతెన నిర్మాణం చేపట్టడానికి రూ.5.5 కోట్లు కేటాయించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంతెన నిర్మాణం గాలికి వదిలేశారు. ఆ వంతెన నిర్మాణం చేపట్టే వరకు బ్రిడ్జి డైవర్షన్ రోడ్డు కోసం రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలుపుతున్నారు. రెండు మండలాల ప్రాంత ప్రజల ఇబ్బంది గమనించి వెంటనే గుండేరు వాగుపై వంతెన నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

కుంగిన వంతెన ఇదే →



నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాలి



ఈ వంతెన గత కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరటంతో ఆయిలపామ్, అరటి, నిమ్మ వంటి వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువెళ్లాలంటే రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో వంతెన పూర్తిగా కుంగిపోయింది. అధికారులు స్పందించి నిధులు కేటాయించి త్వరగా వంతెన నిర్మాణం చేపట్టాలి.
– కడిమి రమేష్, జెడ్పీటీసీ, కామవరపుకోట మండలం

డైవర్షన్ రోడ్డు నిర్మించాలి



మా ప్రాంతం నుంచి వివిధ పనుల నిమిత్తం నిత్యం లింగపాలెం మండలం రంగాపురం, ఆసన్నగూడెం, వేములపల్లి ప్రాంతాలకు ఈ వంతెన దాటి వెళుతూ ఉంటాము. ఇటీవల కురిసిన వర్షాలతో వంతెన పూర్తిగా కుంగిపోయింది. వరదలకు వాగు పొంగటంతో వాగు దాటి వెళ్లాలంటే భయమేస్తోంది. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టే వరకు డైవర్షన్ రోడ్డు నిర్మించాలి
– ప్రొద్దుటూరు వెంకటేశ్వరరావు, రైతు, కళ్ళచెరువు

టెండర్ ప్రక్రియ పూర్తికాగానే..




గుండెరు వాగుపై వంతెన నిర్మాణానికి గతంలో రూ.5.5 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియలో ఆగిపోవడంతో మరలా కూటమి ప్రభుత్వం రాగానే రూ.6 కోట్లు నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. వంతెన ప్రక్కనుండి డైవర్షన్ రోడ్డుకు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే నిర్మాణం చేపడతాం.
– సొంగ సుందర్‌రావు, ఆర్అండ్‌బీ అధికారి, కామవరపుకోట



ద్వారకాతిరుమల: అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన కుంకుళ్లమ్మ



కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో కనకదుర్గమ్మ దర్శనం



జంగారెడ్డిగూడెం రూరల్: అన్నపూర్ణమ్మగా శ్రీరాజరాజేశ్వరీ మాత



పోలవరం: ప్రత్యేక పూజలందుకున్న కనకదుర్గమ్మ తల్లి



జంగారెడ్డిగూడెం: అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్న గంగానమ్మ తల్లి

మాతా అన్నపూర్ణేశ్వరీ.. కటాక్షించమ్మా..

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. దసర ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులను కటాక్షిస్తున్నారు. అందులో భాగంగా శంకు చక్రాలను ధరించి, పరమేశ్వరుడికి అన్నప్రసాదాన్ని అందిస్తున్న అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. అలాగే క్షేత్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలోని ఆలయంలో కొలువైన శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

లింగపాలెం: దసరా ఉత్సవాల్లో భాగంగా ధర్మాజీగూడెంలో వేంచేసిన శ్రీ కనకదుర్గమ్మ తల్లి శనివారం అన్నపూర్ణ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం, బయ్యన్నగూడెంలలోని శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మను అన్నపూర్ణగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజవరం, యర్రంపేట, వై జంక్షన్ కన్నాపురం, అచ్చుతాపురం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో సామూహిక పూజలు నిర్వహించారు. కన్నాపురం రోడ్డులోని టెంపుల్స్ సెంటర్లోని ఆలయాలలో మహిళలు సామూహిక పారాయణాధి కార్యక్రమాలు నిర్వహించారు.



బుట్టాయగూడెం: త్రిశక్తిపీఠంలో అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

అన్నపూర్ణాదేవిగా రాజరాజేశ్వరీ అమ్మవారు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీరామలింగేశ్వరస్వామి వారి క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అయ్యప్ప క్షేత్రంలో ఉపాలయంలో కొలువై ఉన్న శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

పోలవరం రూరల్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు దేవాలయాల్లో



లింగపాలెం: ధర్మాజీగూడెంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో కనకదుర్గమ్మ

అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారిని అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణ, భజన కార్యక్రమాలు సామూహికంగా నిర్వహిస్తున్నారు.

బుట్టాయగూడెం: బుట్టాయగూడెంలోని మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి దేవతల ఆలయం (త్రిశక్తి పీఠం)లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు ఉడతా మహేశ్వరరావు పూజా కార్యక్రమం నిర్వ



జంగారెడ్డిగూడెం: గాయత్రిదేవి అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

హించి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. రెడ్డిగణపవరం, దొరమామిడి, బుట్టాయగూడెం, వైఎస్సార్‌నగర్, తదితర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గ్రామదేవత గంగానమ్మ, వాసవి మాత, విజయదుర్గమ్మ అన్నపూర్ణాదేవిగా పూజలందుకోగా నూకాలమ్మ గాయత్రిదేవిగా దర్శనమిచ్చింది. అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నూకాలమ్మ ఆలయ కళ్యాణ కళావేదిక వద్ద సుమారు 108 బాలికలచే శ్రీ బాలాకుమారీ పూజలు నిర్వహించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జంగారెడ్డిగూడెం: చట్టాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉన్నప్పుడే మహిళలు పూర్తి స్థాయి రక్షణ పొందేందుకు వీలుంటుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం డీసీసీబీ కళ్యాణ మండపంలో విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మహిళా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాశ్చాత్యదేశాల్లో లీగల్ లిటరీ రేటు ఎక్కువగా ఉంటుందని, మన దేశంలో అది చాలా తక్కువ అన్నారు. దీంతో చాలా మంది న్యాయ వ్యవస్థ, వారి కోసం రూపొందించిన చట్టాల ద్వారా సరైన ఫలితాలు పొందలేకపోతున్నారన్నారు. సమాజంలో మహిళల అభ్యున్నతి, రక్షణకు కల్పించిన చట్టాలపైన, ప్రభుత్వం అందించే వివిధ పథకాలపై తెలుసుకోవాలన్నారు. జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్



సదస్సులో మాట్లాడుతున్న కిషోర్ కుమార్

ఫస్ట్ క్లాస్ కేఎస్ఆర్ తేజస్వి మాట్లాడుతూ చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్ ఏపీపీ భువనేశ్వరి, సాయికుమారి వివిధ మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముల్లపూడి శ్రీనివాసరావు, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య, తహసీల్దార్ స్లీవ జోషి , సీడీపీవో బ్యూలా పాల్గొన్నారు.

యువకుడి మృతదేహంతో రాస్తారోకో

వేలేరుపాడు: ట్రాక్టర్ యజమానిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యువకుడి మృతదేహంతో బంధువులు శనివారం రాస్తారోకో చేశారు. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి పదిగంటల వరకు ఆందోళన చేపట్టారు. దీంతో అశ్వారావుపేట నుంచి వేలేరుపాడు వచ్చే ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలన్నీ రోడ్డుపై నిలిచిపోయాయి. డ్రైవింగ్ సక్రమంగా రాని ఓ మైనర్ బాలుడు ట్రాక్టర్ నడపవడంతో అదే ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న చిన బుర్రతోగు గ్రామానికి చెందిన చిచ్చడి వంశీ(16) మృతి చెందాడు. వేలేరుపాడు మండలంలోని భూదేవిపేట గ్రామంలో ఉన్న ట్రాక్టర్ యజమాని నకిరికంటి నర్సింహారావు, సాంబశివరావు ఇంటి ముందు వంశీ మృతదేహంతో బాధితులు రాస్తారోకో నిర్వహించారు. వంశీ కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న కుక్కునూరు సీఐ రమేష్,



యువకుడి మృతదేహంతో బాధితుల ఆందోళన

వేలేరుపాడు ఎస్సై కేవీ రామారావు ఆందోళనకారులతో చర్యలు జరిపారు. చివరకు రూ.3.50 లక్షలు ఇస్తామని ట్రాక్టర్ యజమాని నకిరికంటి నర్సింహారావు అంగీకరంచడంతో బాధితులకు నచ్చచెప్పి ఆందోళన విరమింపజేశారు. తాట్కూరుగొమ్ము సర్పంచ్ కట్టి ఉదయ్‌కిరణ్, వైఎస్సార్ సీపీ నాయకులు కామినేని వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు వలగాని సమ్మయ్యగౌడ్, గోలి వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు వివరాల తనిఖీ

పోలవరం రూరల్: ఈ–పంట నమోదుపై వ్యవసాయశాఖ అధికారులు సూపర్ చెక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలవరం మండలంలోని ప్రగఢపల్లి, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, ఎల్ఎన్‌డీపేట గ్రామాల్లో ఖరీఫ్ 2024 సంవత్సరానికి గాను ఈ–పంట నమోదైన రైతుల సూపర్ చెక్ నిమిత్తం క్షేత్రస్థాయిలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌కే హబీబ్ బాషా, సహాయ వ్యవసాయశాఖ సంచాలకులు పీజీ బుజ్జిబాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు క్షేత్రస్థాయిలో పొలాల్లో పరిశీలించి రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా హబీబ్ బాషా మాట్లాడుతూ వీఏఏలు ఏమైనా పొరపాట్లు చేసి ఉంటే ఈ పంట నమోదు సూపర్ చెక్‌లో సరిచేయడం జరుగుతుందన్నారు. ఈ పంట నమోదైన తరువాత రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ–పంట, ఈ కేవైసీ నమోదైన రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవచ్చన్నారు. రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి: ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్‌బాషా శనివారం పరిశీలించారు. చింతలపూడి మండలంలోని ప్రగడవరం, దేశవరం, శంఖచక్రపురం, పునుకుమాడు, తదితర గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలు చేసిన వ్యవసాయ పంటల ఈ క్రాప్ బుకింగ్ ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో చింతలపూడి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్, మండల వ్యవసాయ అధికారికె.మీనాకుమారి, చింతలపూడి సంబంధించిన రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలు, రైతులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: ఈ–క్రాఫ్ వరిచేలను వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు శనివారం పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్‌బాషా, ఏడిఏ బుజ్జిబాబు ఈ క్రాప్ అయినా పంటల వద్దకు వెళ్లి వాటిని పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ సిబ్బందిని ఇప్పటివరకు ఈ క్రాప్ అయిన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాట్టి పోతుల పోతురాజు, దారం సత్తిరాజు, యాతం సత్యానారాయ, పంది దాసు బాబు పాల్గొన్నారు.



ఈ పంట వివరాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా

శ్రీనివాసా.. గోవిందా



జంగారెడ్డిగూడెం: గోవిందనామాలతో స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శనివారం మార్మోగింది. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ మొదలుకుని తోమాలసేవ, ఆరాధన, బాల భోగ నివేదన, తీర్థప్రసాదగోష్టి తదితర పూజా కార్యక్రమాలు అర్చకులు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భవానీలు, అయ్యప్పస్వాములు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఏలూరుకు చెందిన బొప్పన శివనారాయణ, నాగపద్మ, పోతురు నరసింహరాజు, శింతోజు ప్రసాదరావు ప్రసాద వితరణ చేసినట్లు ఈవో రాంబాబు తెలిపారు.

క్లుప్తంగా

కలెక్టర్ చొరవతో సమస్యకు పరిష్కారం



పునరుద్ధరించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కామవరపుకోట: స్థానిక చొతనా సెంటర్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు పూర్తిగా పాడవడంతో పాటు చేతికి అందే దశలో ఉండేవి. ఇటీవల కాలంలో ఒక పెంపుడు కుక్క ఆ వైర్లు తగిలి మృతి చెందింది. దీనిపై ఇటీవల కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కారం ఫిర్యాదుల నెంబర్‌కు సహాయ పౌండేషన్ ట్రస్ట్ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ వెట్రిసెల్వి స్పందించి సమస్య తీవ్రత దృష్ట్యా విద్యుత్ శాఖ సిబ్బందికి విషయాన్ని తెలియజేయగా వెంటనే సమస్యను స్పందించారు. పాత వైర్లను తొలగించి కొత్త వైర్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం పైకి ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శనివారం రూ.1,50,000 విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన గోపిశెట్టి చంద్రశేఖర్ ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

లింగపాలెం: లింగపాలెంలో శనివారం మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వయంగా స్వీకరించి పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పనిచేయని అధికారులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎంపీడీఓ వాణి, తహసీల్దార్ గరిమల్ల చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా కృష్ణప్రసాద్



కృష్ణప్రసాద్ బాధ్యతల స్వీకరణ

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జీలుగుమిల్లి ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా జంగారెడ్డిగూడెం వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తానని చెప్పారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థి ఆవుల సాత్విక్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

జంగారెడ్డిగూడెం: ఏలూరులో జరిగిన అండర్–17 హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు జంగారెడ్డిగూడెం శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థి ఆవుల సాత్విక్ ఎంపికయ్యాడు. ఈ నెల 7వ తేదీన గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సాత్విక్ పాల్గొననున్నాడు. ఈ మేరకు శనివారం కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో శిక్షణ ఇచ్చిన సోమిశెట్టి వినోద్‌కుమార్, ఇరప రామకృష్ణ, విద్యార్థి సాత్విక్‌కు యాజమాన్యం సింగిరెడ్డి సత్యనారాయణ, కానూరి నాగేశ్వరరావు, గర్రే శ్రీధర్ అభినందనలు తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



రాయపూడిని సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం కుంతలగూడెం ఎంపీయూపీ స్కూల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకటరమణను సహచర ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. వెంకటరమణ ఇటీవల జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా ఆయనకు ఈ సన్మానం నిర్వహించారు. 'స్టేటస్ ఆఫ్ ది టీచర్స్' పత్రాన్ని ఆమోదించిన అక్టోబరు 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా అమలు చేస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. ఎస్ఎంసీ సభ్యులు, బాల బాలికలు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో హుండీ చోరీ

జంగారెడ్డిగూడెం: స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో హుండీ చోరీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. శనివారం ఉదయం అర్చకుడు దర్భా వెంకట సుబ్రహ్మణ్యశర్మ ఆలయానికి వచ్చేసరికి గుడి తలుపులు తెరిచి ఉండడం, హుండీ లేకపోవడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై షేక్ జబీర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా స్థానిక వైఎస్సార్ కాలనీ సమీపంలోని పొదల్లో ఖాళీ హుండీ లభించింది. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ప్రతినెలా మొదటి వారంలో హుండీని తెరుస్తామని, ప్రస్తుతం హుండీలో రూ. 50వేల వరకు ఆదాయం ఉండవచ్చని తెలిపారు. ఆలయంలోని సీసీ కెమెరాకు ఉన్న వైర్లు కత్తిరించి ఈ దొంగతనానికి పాల్పడ్డారని చెప్పారు.

వ్యక్తిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తిపై దాడిచేసి గాయపర్చిన నేరంపై కేసు నమోదైనట్లు ఎస్సై ఎస్‌కే జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేగవరం గ్రామంలో రాముల శ్రీను, మరుదూడి గుండ్రయ్య గ్రామానికి చెందిన గంగరాజు ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. వీరికి నీటి కుళాయి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 4వ తేదీన రాముల శ్రీను తన భార్యతో గొడవపడుతుండగా, తననే తిడుతున్నారంటూ మరుదూడి గుండ్రయ్య, రాముల శ్రీనుపై దాడి చేశాడు. దీనిపై గాయపడిన శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌లు సీజ్

పోలవరం రూరల్: ప్రగఢపల్లి గ్రామ సమీపంలో కొవ్వాడ కాలువలోని ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున కాలువలోని ఇసుకను ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వి తరలిస్తుండగా, పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

చింతలపూడి: నాగిరెడ్డిగూడెంలో శనివారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ భోగేశ్వరరావు ఎస్సై బి.రాజేంద్రప్రసాద్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. తమ్మిలేరు ప్రాజెక్టు సమీపంలో నాటుసారా తయారీకి వినియోగించే వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ భోగేశ్వరరావు తెలిపారు.

సేంద్రియ సాగు రైతులదే భవిష్యత్



పోతురాజు నాగమణి దంపతులకు సన్మానం

కొయ్యలగూడెం: సేంద్రియ పంటలను పండించిన రైతులదే భవిష్యత్తు అని ఉద్యాన శాఖాధికారి ధీరజ్ లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం స్వామినాథన్ అగ్రికల్చర్ కళాశాల(ప్రకాశం)లో సేంద్రియ వ్యవసాయ రైతు, ఎర్రకోట పంద్రాగస్టువేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా వెళ్లిన పాట్టి పోతుల పోతురాజు, నాగమణి దంపతుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్లానెట్ గ్రీన్, వేద భారత్ న్యాచురల్ ఫుడ్ ప్రొడక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ పోతురాజు ప్రకృతి సేద్యాన్ని నిర్వహిస్తూ భావితరాల వారికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ప్లానెట్ గ్రీన్ అధినేత కొయ్యలగూడెం వాసి నిడదవోలు వినయ్‌రామ్ అందించిన సహకారంతో సేంద్రియ వ్యవసాయాన్ని అవలంబిస్తున్నానన్నారు. పురాతన వంగడాల ఉత్పత్తికి కృషి చేయడంలో ఆయన సహకారం ఉందని తెలిపారు. మానవత సభ్యులు నిడదవోలు రామారావు, విద్య రామమోహన్‌రావు, మాజేటి అప్పలరాజు, మద్దిపాటి కొండలరావు, ప్రిన్సిపాల్ హనుమాన్ చౌదరి పాల్గొన్నారు.